ప్రాణాపాయం ఉందని తెలిసి కూడా ఆ నలుగురూ చేపల వేటకి ఎందుకు వెళ్ళారు?

# కట్టా రాంబాబు కథ

## జలజీవనం

ఉదయం ఉదయిస్తున్న వేళ —

ప్రకృతి ప్రశాంతంగా వుంది. తూర్పు దిక్కున సూర్యుడు తన రథం ఎక్కకుండా నెమ్మదిగా కాలినడకన బయలుదేరాడు. గోదావరిలోని కెరటాలు నిర్మలంగా అటూ యిటూ కదులుతున్నాయి. సన్నని ఉదయపు ఎండ గోదావరి ప్రక్కనేవున్న కొబ్బరితోటల్లోని కొబ్బరిచెట్ల ఆకులమీద వెండిలా మెరుస్తోంది.

గోదావరి వడ్డున వున్న యిసుకలో చిన్నచిన్న పీతలు తమ కన్నాల్లోంచి బయటకొచ్చి ఆ యిసుకలో స్పీడుగా పరుగులుతీస్తూ ఏదైనా అలికిడి అయితే కన్పించిన కన్నాల్లోకి దూరిపోతున్నాయి.

'లాగుమా... లాగుమా... యిలా లాగుమా

అలాగెల్లే పిల్లనూ... యిలా లాగుమా'

అంటూ పాడుతూ నల్గురు యువకులు ఒక పడవను తాడుతో కట్టి లాక్కువస్తున్నారు. ఎదురుగాలి మూలాన ఆ పడవకు తెరచాప వెయ్యడానికి వీలుకాక నాలుగైదు మైళ్ళనుంచి అలా లాక్కునే వస్తున్నారు. ఆ పడవలో ఇంకా ముగ్గురు మనుష్యులు కూర్చుని వున్నారు. ఆ ముగ్గురు గోదావరిలో నుంచి వలలను పైకిలాగుతూ అందులో పడిన చేపలను బుట్టల్లో వేస్తూ లాగుతున్న వల భాగాలను పడవలో ఓ మూలకు వేస్తున్నారు. వాళ్ళ ప్రక్కనేవున్న ట్రాన్సిస్టర్‌లో నుంచి భక్తిరంజని పాటలు వస్తున్నాయి.

''ఒరే తొరగా లాగండెహె... ఆకలవుతుంది'' అన్నాడు పడవలో కూర్చున్న వాళ్ళలో ఒకడైన మూలయ్య.



''లాగుతున్నాం గదా మేమేమైనా కూకున్నామా... మాకూ ఆకలవుతుంది మరి. గాలి సరిగ్గావుంటే ఈపాలికి యింటికెళ్లి పోయుండేవాళ్లం'' అన్నాడు లాగుతున్న వాళ్ళలో ఒకడైన ధనరాజు.

వాళ్ళంతా ముందురాత్రి చేపలు పట్టడానికి బయలుదేరిన జాలర్లు. వాళ్ళు ప్రతిరాత్రీ భోజనాలు చేసి పదిగంటలు దాటేవ

తర్వాత పడవలో వలలు వేసుకుని బయలుదేరతారు. వాళ్ళదగ్గరున్న పెద్దపెద్ద వలలను వెళ్ళేటప్పుడు గోదావరిలో అక్కడక్కడా వేసుకుంటూ చాలాదూరం పోతారు. వలలు వెయ్యడం పూర్తయ్యేసరికి అర్ధరాత్రి దాటుతుంది. ఓ రెండు గంటలు గోదావరి ఒడ్డునో లేక మధ్యవరకు పోతే అక్కడున్న లంకల్లోనో పడుకుని నాలుగు గంటల ప్రాంతంలో లేచి తిరుగు ప్రయాణం సాగిస్తారు. అప్పుడు గోదావర్లో వేసిన వలల్ని బయటకు తీసుకుంటూ చేపలు పడితే బుట్టల్లో వేసుకుని తెల్లారేసరికి యిళ్ళకు చేరుకుంటారు.

వీళ్ళొచ్చేవరకు వీళ్ళ తాలూకు ఆడవాళ్ళు ఎదురుచూస్తూ వుంటారు. చేపలు పట్టడం వీళ్ళపనయితే వాటిని చుట్టుప్రక్కల గ్రామాలకు పోయి అమ్ముకుని రావడం ఆడవాళ్ళ పని. ఆడవాళ్ళు చేపలు పట్టుకుని వెళ్ళిన తర్వాత వీళ్ళు చద్దన్నాలు తిని వలల్ని ఎండలో ఆరవెయ్యడానికి ఏటిగట్టు మీదకు పోతారు. ఆ వలల్ని ఆరవేసి ఇంటికి వచ్చేసరికి ఆడవాళ్ళు చేపలు అమ్మిన డబ్బులతో వెచ్చాలు పట్టుకుని వస్తారు. భోజనాలు చేసి గంటా రెండు గంటలపాటు నిద్రపోయి తాము ఆరవేసిన వలల దగ్గరకు పోయి అవేమైనా తెగిపోయి వుంటే వాటిని మళ్లీ అల్లుకుని జాగ్రత్తగా మడత పెట్టుకుని ఇళ్ళకు వస్తారు. రాత్రి భోజనాలు చేసి మళ్లీ వేటకు బయలుదేరతారు... ఇదీ వాళ్ళ దినచర్య.

రేడియోలో భక్తిరంజని అయిపోయినట్లుంది. పాడిపంటల కార్యక్రమాన్ని వినిపిస్తున్నారు రేడియోవారు.

“పెద్దయ్యేమైనా పడుతున్నాయా?” పడవని లాగుతున్న వాళ్ళలో ఒకడైన సాంబయ్య అడిగాడు పట్టిన చెమటను తుడుచుకుంటూ. సాంబయ్య మూలయ్య కొడుకు. అతని వయస్సు ఇరవై ఏళ్లుంటాయి. బలంగా, పొడుగ్గా ఉంటాడు.

“పడుతున్నాయిలేరా అల్లుడూ” అంటూ సమాధానమిచ్చాడు పడవలో కూర్చున్న ముత్యాలు.

“బావకు మరీ ఆత్రంగా వుందిరా అయ్యా” నవ్వుతూ అన్నాడు ధనరాజు. ఇతనిదీ సాంబయ్య వయస్సే. ధనరాజు ముత్యాలు కొడుకు.

“... యింతవరకు పాడిపంటల కార్యక్రమం విన్నారు. ఇప్పుడు వాతావరణ సూచన ప్రాంతంలో వాతావరణం పొడిగానేవుంది. పెద్ద మార్పేమీ లేదు. రాగల ముప్పయ్యారు గంటలలో బెస్తవారు ప్రత్యేకంగా గమనించదగ్గ హెచ్చరికలేమీ లేవు. వాతావరణ సూచన విన్నారు. కొంచెంసేపట్లో ప్రాంతీయ వార్తలు వింటారు” అంటూ రేడియోలో అనౌన్సర్ చెపుతున్నాడు.

“అయితే ఈ రాత్రి మనం ఏటికెళ్ళడానికి అడ్డేమీ లేదన్న మాట” అన్నాడు పడవలోనే కూర్చున్న వ్యక్తి నారాయుడు. ఇతని కొడుకులే పడవ లాగుతున్న మిగిలిన ఇద్దరు యువకులు.

ఈ మూడు కుటుంబాలు ఉమ్మడిగా వేటకెళతాయి. పడవ, వలలు, గెడలు, తెడ్లు — ఇవన్నీ ముగ్గురూ కలిసి సమకూర్చుకున్నవే. వాళ్ళ కుటుంబాల మధ్య బంధుత్వం


ఉంది. మూలయ్య, నారాయుడు అన్నదమ్ముల బిడ్డలయితే ముత్యాలు వీళ్ళిద్దరికీ బావ అవుతాడు. మూలయ్య చెల్లెల్నే ఇతడు పెళ్ళాడాడు.

"... రాష్ట్రంలో చేపలు పట్టేవారి స్థితిగతులను మెరుగుపరచడానికి వారికి కావలసిన నూలు, వెదురు, చేప విత్తనం సరసమైన ధరలకు సరఫరా చేయబడుతుందని రాష్ట్ర మత్స్యశాఖామాత్యులు తెలియజేశారు. వాటిని ఆయా జిల్లా కేంద్రాలలో వున్న మత్స్యశాఖ అధికారులు అందజేస్తారు. వాటికి కావలసిన ధనాన్ని రుణాలద్వారా పొందవచ్చు. అందులో ఏభై శతం సబ్సిడీ ఉంటుంది..." రేడియోలో ప్రాంతీయవార్తలు వస్తున్నాయి.

"రేడియోలో అలాగే సెపుతుంటారు. అవి మనలాంటోళ్లకి అందుతాయంటావా. అంతదూరం ఎల్లి తీసుకురావాలంటే పని మానుకుని ఎల్లాల... ఏబయి రూపాయలు కర్సవుతాయి. యింతా చేసి ఎల్లినా ఆ డబ్బులు మనకి పూర్తిగా వత్తాయా. సగం యిత్తారు. మిగిలింది ఆపీసర్లు తినేత్తారు. ఆ డబ్బుల్తో యింకేం కొంటాం. ఆ బాధలు పడేకంటే వూరుకుంటే వుత్తమం" అన్నాడు మూలయ్య.

"నిజవే నాలుగైదుసార్లు తప్పించుకుంటారు. ఆల్ల బాబుగాడి సొమ్మేదో యిత్తున్నట్టు తెగ బాధపడిపోతారు... యిచ్చే మాలైనా సవకబారుదిత్తారు. దాంతో వలల్ని నేసుకున్నా నాలుగురోజులు కూడా రావు. యిచ్చింతర్వాత మన యిళ్ళసుట్టూ పదిసార్లు తిరుగుతారు అప్పు తీర్సమని. ఆ గొడవంతా ఎవడు పడతాడు వూరుకుంటే సరి" అన్నాడు ముత్యాలు ఆరిపోయిన చుట్టను విసిరేస్తూ.

రేడియో కట్టేశాడు నారాయుడు. ప్రతీరోజూ వాళ్లు తమతోపాటు రేడియోను కూడా తీసుకుపోతారు. అది వాళ్లకు కాలక్షేపంగానూ వుంటుంది. వాతావరణం తెలుస్తుంది.



పెద్దచేపలన్నీ ఓ బుట్టలోను, చిన్నచిన్న వాటిని ఇంకో బుట్టలోనూ, రొయ్యలుంటే వాటిని మరో బుట్టలోనూ వేస్తున్నారు.

"ఒరే ముత్యాలుబావా కూతురి పెళ్ళెప్పుడు సేత్తావురా... ఈ సంవచ్చరమైనా మాకు పప్పుకూడుందంటావా" నవ్వుతూ అడిగాడు నారాయుడు.

"నాదేం వుందిరా నారాయుడూ. అదుగో మా మూలయ్య బావనడుగు ఆడెప్పుడంటే అప్పుడే" అన్నాడు ముత్యాలు కూడా నవ్వుతూ.

"మల్లీ నా మీదెడతావేంట్రా. నేనేవైనా సెయ్యనన్నానా" అన్నాడు మూలయ్య.

"నువ్వు సెయ్యననలేదనుకో. నువ్వు కొడుకుని కన్నోడివి. నేను కూతుర్ని కన్నోణ్ని. ఉన్నదొక్క కూతురు. కట్నం లేకపోయినా పెల్లయినా గనంగా సెయ్యకపోతే నువ్వూరుకోవుగా. అందుకే నాలుగు డబ్బులు పోగడేవరకు సూత్తున్నాను. ఏదైనా ఈ ఏడు సేసెయ్యాలి" అన్నాడు ముత్యాలు.

ముత్యాలు కూతురు లచ్చిమిని మూలయ్య కొడుకు సాంబయ్యకిచ్చి చెయ్యాలని వాళ్ళు చిన్నప్పుడే నిర్ణయించారు. క్రితం సంవత్సరమే పెళ్ళయిపోయి వుండేది. కానీ ముత్యాలు భార్య జబ్బుపడటంతో దాచుకున్న డబ్బంతా ఆమెకు ఖర్చుపెట్టవలసి వచ్చింది. దానితో పెళ్ళి వాయిదా పడిపోయింది.

కాలినడకన బయలుదేరిన సూర్యుడికి కాళ్లు లాగడంతో తన రథమెక్కినట్టున్నాడు తన ప్రతాపమంతా భూమండలంమీద చూపిస్తున్నాడు. ఎండ చిటపటలాడుతోంది పడవ లాగుతున్నవాళ్లు చెమటలు కక్కుతున్నారు. కూర్చున్నవాళ్లు వేడిని భరించలేక పోతున్నారు. ఆకలితో నకనకలాడిపోతున్నారంతా. ఇంక లాభం లేదనుకుని కొబ్బరిచెట్ల నీడలో ఆగిపోయారు. తమ తలలకు చుట్టుకున్న గుడ్డలతో ముఖాలు తుడుచుకున్నారు. పడవలో తెచ్చుకున్న కుండలోని చల్లని నీళ్ళను తాగారంతా. గోదావరి నీళ్ళు తాగడానికి బాగుండవని వాళ్ళు రోజూ కుండతో నీళ్లు తెచ్చుకుంటారు. కాస్సేపు అలసట తీర్చుకుని బయలుదేరారు. ఒక అరగంటలో వీళ్ళు గమ్యస్థానం చేరుకుంటారు. వీళ్ళకోసం ఆదుర్దాగా ఎదురు చూస్తుంటారు ఆడవాళ్లు. వీళ్ల తిరిగి వచ్చేవరకు వాళ్ల గుండెలు అదురుతూ వుంటాయి. వెళ్ళింది నీటిమీద పడవలో. వాళ్ల కుటుంబాల్లో గతంలో జరిగిన అనుభవాలు వాళ్ళకి భయాన్ని కలిగిస్తాయి.

దూరంనుంచే వీళ్ళని చూసినవారి హృదయాలు కుదుటపడ్డాయి. వీళ్ళు చాలా దగ్గరగా వచ్చేశారు.

పొడవుగా, బలంగా కండలు తిరిగిన శరీరంతో చెమటలో మెరుస్తున్న సాంబయ్యను చూస్తుంది లచ్చిమి కళ్లలో ఆనందాన్ని నింపుకుని. లచ్చిమిని చూసిన సాంబయ్య నవ్వుతూ కళ్ళతో పలకరించాడు.

సిగ్గుగా నవ్వింది లచ్చిమి. ఒకరినొకరు రోజూ చూసుకుంటున్నా సరే వాళ్ళకి ఎప్పుడూ కొత్తగానే వుంటుంది. అందులోనూ రాత్రి వెళ్లిన సాంబయ్యను ఉదయం చూసేవరకు మనస్సు నిలవదు. రాత్రంతా నిద్రపోకుండా గోదావరిమీద ఎలావున్నాడో

అని ఆలోచిస్తూ వుంటుంది.

ఆడవాళ్ళంతా చేపల బుట్టలను అందుకున్నారు. సాంబయ్య, ధనరాజు పడవను ఒడ్డుకి లాగికట్టేశారు. మిగిలినవాళ్ళు వలల్ని చిక్కుపడకుండా తీస్తున్నారు. నారాయుడు మొత్తం చేపల్ని మూడు వాటాలువేసి పంపకం చేశాడు. ఆడవాళ్ళు ఎవరి వాటా వాళ్ళు తీసుకుపోయారు. మగవాళ్ళంతా వలల్ని తీసుకుని యింటిముఖం పట్టారు.

* * *

మిట్టమధ్యాహ్నంవేళ సూర్యుడు నడినెత్తి మీదున్నాడు.

గోదావరి పొటుగా వుండడంతో కెరటాలు వువ్వెత్తుగా లేచిపడుతున్నాయి కెరటాల తాకిడికి ఒడ్డునున్న యిసుక లోపలికి పోతోంది.

విసుగ్గా వుంది సాంబయ్యకు. గంటనుంచీ అలాగే అక్కడ ఎదురు చూస్తున్నాడు. ఎక్కడా వస్తున్న జాడలేదు. కోపంగా కూడా వుంది. ఓ కొబ్బరిచెట్టు నీడలో కూర్చుని అక్కడున్న మట్టిబెడ్డలను గోదావర్లోకి విసురుతున్నాడు.

"బావా!" తియ్యని పిలుపు వినబడేసరికి వెనక్కి చూశాడు సాంబయ్య.

అక్కడ లచ్చిమి నిలబడి వుంది. చేతిలో కాళీచెంబుతో యిళ్ళదగ్గర ఒకరికొకరు చూసుకోవడమే తప్ప మాట్లాడుకోవడానికివీలు పడదు. మాట్లాడితే ఎవరైనా చూసి గేలి చేస్తారేమోనని భయం. అందుకే గోదావరి గట్టుకి వచ్చి అప్పుడప్పుడు తనివితీరా మాట్లాడుకుంటారిద్దరూ. సాంబయ్య అయితే మామూలుగా వచ్చేస్తాడు కానీ లచ్చిమి రావడానికి వీలుకాదు. అందులోనూ సాంబయ్యను కలుసుకోడానికయితే అసలే వప్పుకోరు. వాళ్లెంత బావామరదళ్లయినా పెళ్లికిముందు కలిసితిరగడాన్ని వాళ్ల వాళ్లెవ్వరూ వప్పుకోరు. అందుకే బయటకు వెళ్ళే నెపంతో చేతిలో చెంబు పట్టుకుని బయలుదేరుతుంది లచ్చిమి. ఆ సమయంలో మగవాళ్లంతా మంచి నిద్రల్లో వుంటారు కాబట్టిఅ



## ఎలా!

భార్యతో కోపంగా అన్నాడు భర్త—

"ఇంట్లో ఇంతమంది ఉన్నారు దేనికి' ఇక్కడ శుభ్రం వెయ్యమంటే ఇంకా అలాగే ఉంది! పనిచేతగాని వాళ్ళెవరైనా సరే, వాళ్ళని ఇంటినుంచి గెంటేయ్!"

"ఎలా గెంటమంటారండీ? ఎంతైనా మీరు నా భర్తకదా?"

"....?!"

—సిరిసిల్లా రశీద్ శ్రీక్ (బీబీపేట)

క్కడెవరూ ఉండరు. ఆడవాళ్లెవరూ అంత దూరం రారు. వాళ్లు కలుసుకోడానికి అనువైన సమయమది.

"రా లచ్చిమీ" అంటూ పిలిచాడు సాంబయ్య.

లచ్చిమి వచ్చి సాంబయ్య పక్కన కూర్చుంది.

లచ్చిమి అందంగా తయారయ్యింది. ఆమె కాస్త శుభ్రంగా ఉంటుంది. మిగిలినవాళ్ళలా చింపిరి చింపిరిగా వుండదు. తల దువ్వుకుంది. తెల్లని లంగామీద నల్లని ఓణీ వేసుకుంది. తల్లో బంతిపూలు పెట్టుకుంది. కళ్ళలో సాంబయ్య మీది ప్రేమనంతా నింపుకుని అతనివంక చూస్తుంది.

ముందు ఆమెమీద కోప్పడాలనుకున్నాడు కానీ ఆమెనలా చూసేసరికి ఎక్కడి కోపం అక్కడికే ఎగిరిపోయింది. "ఇంత ఆలస్యంగా వచ్చావేం" అని మాత్రం అడిగాడు.

"ఎప్పుడో వద్దామని తయారయ్యాను. అమ్మకు మల్లీ దగ్గు బాగావచ్చింది. అదలా దగ్గుతుంటే సూత్తూ రాలేకపోయాను. దాన్ని నిద్రపుచ్చి యిలా వచ్చాను" సంజాయిషీ ఇచ్చుకుంది.

"లచ్చిమీ!" అంటూ ప్రేమగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు సాంబయ్య.

మెరుస్తున్న కళ్ళతో అతని ముఖంలోకి చూస్తోంది లచ్చిమి.

"ఎంతకాలం మనమిలా దొంగచాటుగా కలుసుకోవాలి" అడిగాడు సాంబయ్య.

ఆమెక్కూడా అతనితో ఎప్పుడెప్పుడు జీవితాన్ని పంచుకుందామా అని వుంటుంది కానీ వాళ్లని పరిస్థితులు కలువనివ్వడంలేదు

"ఈ సంవత్సరం మనిద్దరికీ మనువు జరిపించేత్తా నంటున్నాడు మా అయ్య" నవ్వుతూ అంది లచ్చిమి.

కాస్సేపు వాళ్ళిద్దరలా ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకుంటూ వుండిపోయారు.

"బావా! నేనోమాట సెపుతాను వింటావా?" అనడిగింది.

"ఏమిటి చెప్పు"

"నువ్వింక సేపలు పట్టడానికెల్లకు బావా. నువ్వు రాత్రెల్లి పొద్దున్నొచ్చే వరకు నా మనసు నిలవటం లేదు. నాకేంటో బయంగా ఉంటుంది. మనం బతకాలంటె ఏటికే ఎల్లక్కర్లేదుగా. ఏకూలోనాలో సేసుకుని బతకొచ్చు" అంది లచ్చిమి దిగులుగా.

"నీ కెందుకే అంత బయం. మన కులవృత్తిని ఎలా వదులుకుంటాం. గోదాట్లో ఏం జరుగుతుంది. నాకు ఈత బాగా వచ్చు నీకు తెలుసా"

"అదికాదు బావా! మీ తాత, మా తాత కూడా గజ ఈతగాళ్లే. కాని వాళ్ళొకసారి ఏటికెళ్ళి తిరిగి రాలేదు నీకు తెలుసుగా. ఏ రోజుఎలాంటిదో మనం సెప్పలేం బావా.... రేపు పెళ్ళయితే నేను కూడా పనిసేత్తాను. యిద్దరం రోజుకి సెరో పది సంపాదించుకోవచ్చును. మనం సుకంగా బతకొచ్చు బావా" అంది కళ్ళనిండా నీళ్ళు నింపుకుని. ఆమె మాటలకు అతని మనస్సు కరిగిపోయింది. "అలాగే లచ్చిమీ. పెళ్ళయింతర్వాత ఏట మానెత్తన్లె. ఎక్కడైన పనెతు

క్కుంటాను సరేనా'' అంటూ ఆమెను దగ్గరకు తీసుకుని కళ్ళు తుడిచాడు. ఆమె ముఖాన్ని చేతుల్లో తీసుకుని నుదిటిమీద ముద్దు పెట్టుకున్నాడు.

''బావా'' అంటూ ఆనందంగా అతనివంక చూసింది. ఆమెను తన గుండెల్లోకి బలంగా హత్తుకున్నాడు. అతని కౌగిట్లో ఆమెకెంతో హాయిగా, వూరటగా ఉంది. నెమ్మదిగా తప్పించుకొని ''నేనెల్తాను బావా'' అంటూ చెంబు తీసుకుని వెళ్ళిపోయింది లచ్చిమి. వెళుతున్న ఆమెను ప్రేమగా చూస్తూ అక్కడే ఉండి పోయాడు సాంబయ్య.


* * *

మూడు రోజుల నుంచీ ముసురు పట్టింది. వర్షం కుంభవృష్టిలా పడుతుంది. అక్కడంతా రొంపిగా ఉంది. మామూలుగానే అక్కడ చేపల కంపూ కొడుతూ ఉంటుంది. ఇంక వర్షం పడితే అసలే చెప్పలేం. అక్కడ సుమారు ఏభయి గుడిసెలున్నాయి. వాళ్ళంతా చేపలు పట్టే వాళ్ళే. వర్షం పడితే ఆ గుడిసెల్లో వాళ్ళంతా ముడుచుకు కూర్చోవలసిందే. చుట్టూ నీరుండటంతో బయటకు రావడానికి వీలుండదు

వర్షాకాలం వాళ్ళకంతా ఇబ్బందే. వేటకెళ్ళడానికి వీలుండదు. పొయ్యి మీదకు వెచ్చాలుండవు. పొయ్యి క్రిందకు పుల్లలు తడిసిపోయి ఉంటాయి. వరుసగా మూడు నాలుగు రోజులు వర్షం కురిసిందంటే వాళ్ళంతా పస్తులు పడుకోవలసిందే.

ప్రభుత్వాలు మారుతున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. కానీ వాళ్ళ పరిస్థితుల్లో మార్పు రాలేదు. అందరూ వాళ్ళని దోచుకునే వారే గానీ వాళ్ళని బాగుపరిచే వాళ్ళు మాత్రం లేరు. తరతరాల నుంచీ అక్కడ పూరిగుడిసెలే ఉంటున్నాయి.

''ఇంకో రెండు రోజులు కురిస్తే మనగుడిసెలన్నీ కూలిపోతాయి. మళ్లీ కొత్త



## చేపలకు పాలు?

యమునా నదిలోని నీరు కలుషితం అవుతోందని చాలామంది వాపోతూ ఉంటారు! మొన్నీమధ్యనే యమునా ప్రదూషణ్ ముక్తి అభియాన్ సమితి ఆధ్వర్యంలో ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ నుంచి వేలాదిమంది ప్రజలు రంగురంగుల దుస్తులలో, అందంగా అలంకరించిన కుండలలో యమునానది ఒడ్డుకు చేరి రెండువేల లీటర్లకు పైగా పాలను నదిలో కలిపారు. పాలు బ్లీచింగ్ పౌడర్‌గా పనిచేసి నీటిని శుభ్రపరుస్తాయన్న వారి నమ్మకమే వారిచేత ఇలా చేయించింది. నీటి శుభ్రం సంగతేమోగానీ... ఆ రోజున యమునా నదిలోని చేపలు నీటికి బదులు పాలను త్రాగివుంటాయి!

—జూపిటర్

గా ఏసుకోవాలి'' అన్నాడు ముత్యాలు తన గుడిసెలో ఓ మూల కూర్చుని. చలికి ఆగలేక దుప్పటి ముసుగు వేసుకున్నాడు. ఎదురుగా కుంపటిలో నిప్పులు వేసుకుని చలి కాచుకుంటున్నాడు.

''యిర్యేల గెంజి కాయడానికి నాలుగు బియ్యపు గింజలైనా వున్నాయి. రేపటికయి లేవు. ఏంజెయ్యాలో ఏవో'' అంది ముత్యాలు భార్య రావులమ్మ.

లచ్చిమి మంచం మీద కూర్చుని బయట పడుతున్న వర్షాన్ని చూస్తుంది. ధనరాజు చేతివలకు చిరుగులు పడితే అతుకులు వేస్తున్నాడు. ఆ ముగ్గురికి మూడు గిన్నెల్లో గంజి పోసియిచ్చింది. నిప్పులమీద కాల్చిన ఎండు చేపల్ని కూడా యిచ్చింది. అవి తిని గంజి తాగారు వాళ్ళు. అంతలో వానలో తడుస్తూ అక్కడకు వచ్చాడు సాంబయ్య. చేతిలో సంచి ఉంది. అది తడవ కుండా గుడ్డ చుట్టాడు. సాంబయ్యను చూసి మంచంమీద కూర్చున్న లచ్చిమి వెంటనే లేచింది. ఆ సమయంలో అతన్ని చూస్తే ఆనందం కల్గినా 'తడుస్తూ రాకపోతేనేం జలుబు చెయ్యదూ' అని ప్రేమగా విసుక్కుంది.

''రారా అల్లుడూ కూడు తిన్నావా.... మీ అత్త గెంజి కాపింది తాగుతావేంటి'' అంటూ పలకరించాడు ముత్యాలు.

''నేను అన్నం తినే వచ్చాను మావా'' అన్నాడు సాంబయ్య. ఓ తుండుగుడ్డ తెచ్చి సాంబయ్యకిచ్చి ''తుడుచుకో బావా. తల బాగా తడిచిపోయింది'' అంది లచ్చిమి. తన చేతిలో ఉన్న సంచిని లచ్చిమి కిచ్చి ''యిందులో బియ్యమున్నాయి మీ అమ్మకియ్యి... మా అమ్మ పంపింది'' అన్నాడు.

''కోడలు పత్తులుంటాదనెమో'' అన్నాడు నవ్వుతూ ముత్యాలు.

''అదేంకాదు'' అన్నాడు సాంబయ్య తనూ నవ్వుతూ ఆ సమయంలో రావులమ్మకు సాంబయ్యలో దేవుడు కన్పించాడు. సాంబయ్య వెళ్ళి ధనరాజు ప్రక్కన కూర్చుని ''యిప్పుడిదెందుకురా'' అనడిగాడు.

''గోదారి మీదకు ఎలాగు ఎల్లలేం గోతుల్లోనో, కాలువల్లోనో ఏత్తే ఏవో సిన్నసిన్నవి దొరక్కపోతాయంటావా... వాన తగ్గితే ఎల్దామనుకుంటున్నాను'' అన్నాడు ధనరాజు.

''నన్ను కూడా పిలు యిద్దరం ఎల్దాం'' అన్నాడు సాంబయ్య. కాస్సేపు అంతా పిచ్చాపాటి మాట్లాడుకున్నారు.

వర్షం కొద్దిగా తగ్గింది. తను వెళతానని లేచాడు సాంబయ్య.

''నేనూ వత్తాను పదరా మీ నాన్నని సూడాలి'' అంటూ సాంబయ్య వెంట బయలుదేరాడు ముత్యాలు. లచ్చిమికి కళ్ళతోనే వెళతానని చెప్పాడు. ఇద్దరూ నెమ్మదిగా నీళ్ళలో నడుచుకుంటూ మూలయ్య ఇంటికి వచ్చారు. వీళ్ళు వెళ్ళేసరికి నారాయుడు అక్కడే ఉన్నాడు. మూలయ్య, నారాయుడు అన్నం తింటున్నారు. రత్తమ్మ వాళ్ళకి కావలసినవి వేస్తుంది.

''రారా ముత్యాలు నీమాటే అనుకుంటున్నాం. కూడు తిన్నావో లేదో... ఒసే ఈడికీ గిన్నట్టా కొంచెం తింటాడు'' అంటూ రత్తమ్మకు చెప్పాడు.

రత్తమ్మ ఓ గిన్నెలో అన్నం, ఎండిరొయ్యల పులుసు వేసి తీసుకొచ్చి "తినవ్వా" అంది.

ముందు వద్దని ముఖమాట పడినా అన్నం కూర చూసేసరికి నోరూరి గిన్నందుకున్నాడు.

మూలయ్య అక్కడ కాస్త గౌరవంగానే బతుకుతున్నాడు. అతన్నంతా తమ కుల పెద్దలుగా భావిస్తారు. ఆ వూరు పంచాయతీకి మెంబరుకూడా. నాలుగు డబ్బులు వెనకేసుకున్నాడేమో అందర్నీ ఆపదలో ఆదుకుంటాడు. అతవే అక్కడ మంచీ, చెడ్డా చెబుతూ అందర్నీ ఏకత్రాటిమీద నడిపిస్తూ వుంటాడు. నారాయుడింటికి కూడా బియ్యం పంపించాడు. ముగ్గురూ అన్నాలు తినడం పూర్తయింది.

మళ్ళీ వర్షం మొదలయింది. ఈసారి గాలి కూడా వీస్తోంది.


"ఇలా అయితే మనం సాలారోజులు పత్తులుండాలేమో" అన్నాడు నారాయుడు.

"ఏం సేత్తాం మన బతుకులింతే. ఆ గోదారి తల్లిని నమ్ముకున్నాం. పైన వానలెక్కువగా ఉన్నాయేమో గోదారికూడా పొంగుతుంది. ఎప్పుడు తగ్గుతాయో... ఎప్పుడు ఏటకెలతామో" నిరాశగా అన్నాడు ముత్యాలు.

"గాలీవాలూ బాగున్నప్పుడే ఎల్దారి లెండ్రా అప్పటివరకు అంతా కలో, గెంజో కాసుకుని తాగుదాం" అన్నాడు మూలయ్య.

కాస్త తెరిపిచ్చాక ముత్యాలు, నారాయుదు ఇళ్ళకెళ్ళడానికి బయలుదేరారు.

"ఒరేయ్! మీరు అందరిల్లకూ ఎల్లి నా మాటగా సెప్పండి. ఈ నాలుగురోజులు ఎవర్నీ ఏటికెల్లొద్దని చెప్పండి. వర్సం, గాలీ తగ్గాక ఎల్దామన్నానని సెప్పండి. ఈలోగా గోదారికూడా తగ్గుతుంది. అలాగే మాటలో మాట ఆ తాతిగాడి తోటి వడ్డీ ఓ పావలా తగ్గించుకుని అందరికీ అప్పులిమ్మని కూడా సెప్పండి" అన్నాడు మూలయ్య. అలాగే



అని వాళ్ళు అందరిళ్ళకూ వెళ్ళి చెప్పారు. మూలయ్య సెప్పిం తర్వాత వెళ్ళడానికి ఎవరికీ ధైర్యం చాలదు. తాతయ్య వాళ్లందరికీ స్వల్పకాల అప్పులిస్తాడు. వడ్డీ ఎక్కువ వసూలు చేస్తాడు. అతనుకూడా వాళ్లవాడే. వేపలు పట్టకుండా తన దగ్గరున్న డబ్బుల్ని వడ్డీకి తిప్పుతుంటాడు. వడ్డీ ఓ పావలా తగ్గించినా అతనికి లాభమే. ఎందుకంటే ఆ సమయంలో అందరూ అతని దగ్గర తప్పనిసరిగా అప్పు తీసుకుంటారు. వాళ్ల గుడిసెలకు ఫర్లాంగు దూరంలో గోదావరి ప్రవహిస్తూ ఉంటుంది. గోదావర్లో ఎంత ఉధృతంగా నీరు ఉన్నా వాళ్ళ గుడిసెల వరకూ రాదు. ఎందుకంటే అక్కడకు పదిమైళ్ళ దూరంలో సముద్రం ఉంది. ఈ నీరు సముద్రంలో కలవడంవల్ల ఎంత నీరొచ్చినా అక్కడికే పోతూ వుంటుంది.

* * *

నాలుగురోజులనుంచీ కురుస్తున్న వర్షం ఆ రోజే ఆగింది. అయినా ఇంకో నాలుగు రోజుల వరకూ వేటకెళ్ళకూడదని అంతా నిర్ణయించుకున్నారు. కారణం గోదావరి ఉధృతంగా ఉండటమే. అక్కడి కుటుంబాల్లో చాలా కుటుంబాలు పస్తులు పడుకుంటున్నాయి. తాతయ్య కొంత పరిమితి వరకే అప్పు ఇస్తాడు. అందరూ ఆ పరిమితి వరకూ ముందే తీసుకున్నారు కాబట్టే ఇంక ఇవ్వనన్నాడు. మూలయ్య పిలిచి చెప్పినా తన దగ్గరున్నందతా ఇచ్చేసానని, ఇవ్వడానికింకేం లేదని చెప్పాడు. మూలయ్య కూడా తనదగ్గరున్న కొద్దిమొత్తాన్ని వడ్డీ లేకుండానే చాలా మందికిచ్చాడు. అయినా వాళ్ళ పరిస్థితి అలాగే వుంది.

సాంబయ్య, ధనరాజు ఏటి గట్టు మీద కొచ్చారు. ఏటి గట్టుని ఆనుకునే వాళ్ళ ఇళ్లున్నాయి. అసలు వూరంతా ఏటిగట్టు అవతలే ఉంటుంది. ఏటిగట్టుకి ఒకప్రక్క కాలువ, మరొక ప్రక్క గోదావరి ఉంటాయి. గోదావరి ప్రభావం కాలువమీద కూడా పడటంతో కాలువలో కూడా నీళ్ళు ఎక్కువగానే ఉన్నాయి.

"ఇలా అయితే మనం బతకలేం. ఎంత కాలమిలా ఏటికెళ్లకుండా ఉండాలి" అన్నాడు ధనరాజు.

"అదేరా నేమూ ఆలోసిత్తన్నాము. మనోల్లు ఇంకో నాలుగు రోజుల వరకు ఏటికెళ్ల కూడదన్నారు. ఈ నాలుగురోజులు ఇక్కడోల్లంతా బతకాలిగా" అన్నాడు సాంబయ్య.

ఇంతలో నారాయుడి కొడుకులిద్దరూ అక్కడికొచ్చారు.

"ఒరేయ్! సీతాలుగాడి నాలుగో కొడుక్కి బాగా జొరంగా వుందంట, మందేయించడానికి డబ్బుల్లేక ఆల్లంతా ఏడుత్తున్నారు" అన్నాడు నారాయుడి పెద్దకొడుకు వరహాలు

"ఆడి పేనం పోయినా సేసేదేం లేదు. ఆడికే కాదు ఎవరికేం వచ్చినా అంతే మన బతుకులిలా రాసున్నాయి. అనుభవించ వలసిందే" అన్నాడు ధనరాజు నిరాశగా.

అలాగని సూత్తూ వూరుకుంటే ఎలారా ధనరాజు. మనం ఏదోటి సెయ్యాలి గాని"

అన్నాడు నారాయుడి చిన్నకొడుకు సత్తిరాజు.

“మన కడుపులు కాలుతూవుంటే ఆ గోదారి తల్లి ఎలా సూత్తూ వూరుకుందో. ఆ తల్లికి మనమీదింకా దయకలగలేదు” అన్నాడు వరహాలు.

సాంబయ్య కాస్సేపు ఆలోచించి అన్నాడు.

“ఒరేయ్! నేను సెప్పేది మీరు జాగ్రత్తగా వినండి. ఈలాగే మనం సూత్తూ ఊరుకుంటే లాభం లేదు. మనోల్లు తిండి తిని సరిగ్గా వారం రోజులు కావొత్తోంది. ఇంకో నాలుగురోజులుంటే ఎవరూ మిగలరు. మన గురించి పట్టించుకునేవాళ్లెవరూ లేరు. మన పెద్దోల్లమాటని ఏటకెళ్లకుండా వుంటే అంతా సత్తాం. అందుకని...” కాస్సేపు ఆగాడు

“ఏం సేద్దామంటావ్?’ ధనరాజు అడిగాడు.

“మనం ఈరోజునే ఏటకు బయలుదేరదాం. ఈ సమయంలో మనం భయపడితే లాభం లేదు. మన జీవితం అంతా జలం మీదే జరిగిపోతుంది. అట్లాంటప్పుడు గోదాట్లో కొంచెం నీరున్నంత మాత్రాన మనం ఎందుకు భయపడాలి. అసలు ఇప్పుడే మంచి సేపలు పడతాయి. గోదాట్లోకి కొత్త నీరొచ్చింది కదా మంచి మంచి పులస్సేపలు పడొచ్చు” అన్నాడు సాంబయ్య.

“మరి మనోల్లు వప్పుకోరుగా” అన్నాడు వరహాలు.

“మన పెద్దోల్లకి సెప్పొద్దు. అసలెవరికీ సెప్పొద్దు. మన నల్గురమే ఎవరూ సూడుకుండా ఎల్దాం. ఈరోజు మనం ఎల్తొత్తే రేపు మిగతా వోల్లంతా బయలుదేరతారు. మొదట్లో కొంచెం భయపడినా కడుపులు కాల్చుకుంటూ ఊరుకోలేరుగా. ముందు మనం ధైర్యం చేద్దాం. మనోల్లు కోప్పడినా మనం లెక్క సెయ్యొద్దు. మనం ఏటకెల్లకపోతే మన ఇళ్లలో లోటు లేకపోవచ్చు కాని మిగతా వాల్లకోసమైనా ఈ పని సెయ్యాలి” అన్నా



## వాడే

“అంతెత్తు మేడపైనుంచి కిందపడ్డా బతికి ఉన్నావంటే భగవంతుడు నీవెంట ఉండి రక్షించాడన్నమాట” అన్నాడు సానుభూతిగా డాక్టరు.

“వాడే కావచ్చుసార్ కావాలని నన్ను పైనుండి కిందికి తోసాడు” అన్నాడు పల్లెటూరివాడు.

—సిరిపిల్లా రశీద్ శిక్షక్ (బీబీపేట)

దు సాంబయ్య.

"అలాగే ఎల్దాం" అన్నాడు సత్తిరాజు.

"అయితే మనం ఒక పని సేద్దాం. రాత్రి అన్నాలు తిన్నాక సెకండాట సినిమా కెల్తున్నామని సెప్పి బయలుదేరదాం. ముందే మనం వలల్ని, బుట్టల్ని బయట పెట్టుకుంటే అంతా నిద్దరోయాక ఆటిని తీసుకెల్లొచ్చు. సరే ఇంక పోదాం పదండి.

సరిగ్గా రాత్రయ్యాక సినిమా కని సెప్పి మా ఇంటి కొచ్చెయ్యండి" అని చెప్పాడు సాంబయ్య.

అందరూ ఎవరిళ్లకు వాళ్ళు వెళ్లిపోయారు.

అంచులకు లాక్కొచ్చారు. వలలు, బుట్టలు, తెడ్లు, గడలు, తెరచాప పడవలో ఎక్కించారు. నలుగురు పడవ ఎక్కారు. పడవను ఒడ్డునుంచి గెడలో తోస్తూ కొంచెం దూరం పోనిచ్చారు. సాంబయ్య తెరచాపను కొయ్యకుకట్టి పైకి లాగాడు. ధనరాజు చుక్కాని గట్టిగా పట్టుకున్నాడు. వరహాలు, సత్తిరాజు తెడ్లు వేస్తున్నారు. తెరచాప పైకి లేచిన వెంటనే గాలికి ఒక్కసారిగా పడవ ఒక ప్రక్కకు వంగుతూ ముందికి కదిలింది. ధనరాజు జాగ్రత్తగా చుక్కాని పట్టుకుని పడవను కంట్రోలు చేస్తున్నాడు. పడవ వేగంగా ముందుకుపోతోంది.

* * *

రాత్రి పది గంటల సమయం. అంతా గాఢాంధకారంగా వుంది. ఆకాశంలో నక్షత్రాలు మిణుకుమిణుకుమంటూ మెరుస్తున్నాయి

గోదావరి కన్నెపిల్లలోని యవ్వనంలా పురకలేస్తుంది. ఆ ఉధృతాన్ని చూసి భయపడ్డారా నల్గురు. అసలు పడవ గోదార్లో నిలుస్తుందా అనే సందేహం వచ్చింది. అయినా అధైర్యపడకూడదనుకున్నారు. వర్షం వచ్చే సూచన లేమీ లేవని ఇందాక రేడియోలో చెప్పారు. ముఖ్యంగా [illegible]వారికి ప్రత్యేక సూచనలేమీ లేవన్నారు. అందుచేత వర్షానికి భయపడక్కర్లేదు. కొంచెం పడవను జాగ్రత్తగా కంట్రోలు చేసుకుంటే ఇంకా భయమేమీ ఉండదనుకున్నారు. సాంబయ్య టార్చి చూపిస్తుంటే మిగిలిన ముగ్గురూ పడవను వడ్డునుంచి ఈడ్చుకుని గోదావరి

* * *

బయట వర్షం పడుతుంటే మూలయ్యకు మెలకువ వచ్చింది. లేచి బయటకొచ్చాడు. చీకటిగా వుంది 'ఇకా కోళ్ళు కుయ్యలేదు' అనుకున్నాడు. లోపలికొచ్చి సాంబయ్య మంచం వంక చూశాడు. మంచం ఖాళీగా ఉంది. 'సినిమా కెల్లినోళ్లు ఇంకా రాలేదేంటబ్బా' అనుకుని మళ్ళీ బయటకొచ్చాడు. ఒకవేళ వర్షంవల్ల ఎక్కడైనా ఆగారా అనే సందేహం వచ్చింది. ఎందుకైనా మంచిదని తడుస్తూనే నారాయుడింటికి వెళ్లాడు. అతణ్ణి లేపితే తన కొడుకులు కూడా రాలేదన్నాడు. ఇద్దరూ కలిసి ముత్యాలింటికి వెళ్లారు. ముత్యాలు కూడా ధనరాజు రాలేదన్నాడు. లచ్చిమి కూడా లేచింది. వాళ్లమీద కోపం వచ్చింది. ఇప్పుడు సినిమా కెళ్లకపోతేనేం అని విసుక్కుంది.

‘‘తెల్లారి వస్తార్లే బావా, వర్షానికి సినిమా హాలుకాడ ఏ హోటల్లోనో తొంగుమంటారు. పోయి పడుకోండి’’ అన్నాడు ముత్యాలు ఆవలిస్తూ. మూలయ్య, నారాయుడు ఎవరిళ్లకు వాళ్లు తడుస్తూనే వచ్చారు. మూలయ్యకు పడుకుందామన్నా నిద్ర రాలేదు. చుట్ట వెలిగించుకుని అరుగుమీద కూర్చుని వర్షం వంక చూస్తున్నాడు.

దూరంగా నక్కలు అరుస్తున్నాయి. పైన తీతువు పిట్ట అరుచుకుంటూ పోతోంది.

వర్షంతోపాటు గాలికూడా అందుకుంది. ఆ గాలికి అక్కడున్న కొబ్బరిచెట్లు వూగుతున్నాయి. గాలివేగం కూడా ఎక్కువవుతోంది.

‘తుపానులా వుంది’ అనుకున్నాడు మూలయ్య.

కాస్సేపటికే అక్కడంతా గోలగోలగా తయారయ్యింది. అక్కడన్నీ తాటాకిళ్ళేమో ఇళ్ళమీదున్న ఆకులు గాలికి లేచిపోతున్నాయి. వర్షం మూలంగా చివికిపోయిన దూలాలవడంవల్ల ఇళ్ళు కూలిపోతున్నాయి. ఇళ్ళలోని జనమంతా బయటకు వచ్చేస్తున్నారు. గోరుచుట్టుమీద రోకటిపోటయ్యింది వారి పని. అంతా చీకటి వుందేమో ఎవరికీ ఏమీ కనబడటం లేదు. అలాగే కిందా మీదా పడుతూ ధనమ్మ గుడి దగ్గరకు చేరుకున్నారు.

ధనమ్మ వారి కులదేవత. వాళ్ల గుడిసెల మధ్యగా వుంది గుడి. గుడి పెద్దదిగా ఉంటుందేమో అంతా అక్కడ దలదాచుకున్నారు. తెల్లారేసరికి గాలి, వర్షం తగ్గాయి. రాత్రంతా గుడిలో ఉన్న వాళ్లంతా బయటకొచ్చారు. కూలిపోయి మొండిగోడల్లా ఉన్న వాళ్ల ఇళ్ళను చూసుకుంటే వారికి దుఃఖం ఆగడంలేదు. కొందరు గట్టిగానే ఏడుస్తున్నారు. మూలయ్య అందర్నీ వూరుకోబెడుతున్నాడు. ఆ వూరి ప్రెసిడెంట్ వీళ్లందరికీ అన్నాలు వండించి పెట్టాడు. ఆ సమయంలో వారికెవరికీ ఆ నలుగురు గుర్తే రాలేదు.

## నీటి అట్లాస్



మన దేశంలో భూగర్భ జలవనరుల గురించి ఇప్పటిదాకా ఇచ్ఛితమైన సమాచారం అందుబాటులో లేదు! అందువల్లనే నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజన్సీ, సెంటర్ ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్‌లు సంయుక్తంగా ఉపగ్రహాల సహాయంతో సేకరించిన సమాచారం ఆధారం చేసుకొని ఈ మధ్యనే భూగర్భ జలవనరుల గురించి జిల్లాలవారీ అట్లాసును రూపొందించారు. అంటే ఈ అట్లాస్ సహాయంతో దేశంలో ఏ ప్రదేశంలోనయినా నీరు ఉందో లేదో క్షణాల్లో తెల్సుకోవచ్చన్న మాట! ఇది నిజంగా అత్యంత ఉపయోగకరమైన పరిశోధన అనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

—ఆర్బీయన్

అంతా ఈ హడావిడిలో పడివున్నారు.

లచ్చిమి మూలయ్య దగ్గరకొచ్చి "మా వా! బావింకా రాలేదు" అంది నెమ్మదిగా.

ఆ మాట విని మూలయ్య ఉలిక్కిపడ్డా డు. "వీడింకా రాలేదేమిటి చెప్మా" అనుకు న్నాడు. ముత్యాల్ని, నారాయుణ్ణీ పిలిచి చెప్పాడు. ఇంక అక్కడ వాళ్లగురించి కంగా రు మొదలయ్యింది. సినిమా కెళ్లిన వాళ్లు ఇంకా రాకుండా ఎందుకుంటూరు? వీళ్లు సినిమాక్కాదు ఇంకెక్కడికో పోయుంటార ని అందరికీ అనుమానం వచ్చింది.

అయితే ఎక్కడికెళ్ళుంటారు?

అంతలో అక్కడికి పరుగెత్తుకుంటూ ఒకడొచ్చి "మూలయ్యన్నా మీ పడవ కనిపించడం లేదు. మావన్నీ వున్నాయిగాని మీదే లేదు" అన్నాడు వగుర్చుకుంటూ.

అందరికీ గుండెల్లో రాయిపడింది. ఒకవే ళ వీళ్ళు వేటగ్గాని వెళ్లారా అనే ఆలోచన వచ్చేసరికి. వాళ్ళు భరించలేకపోయారు. గాలికి పడవ గోదార్లోకి కొట్టుకుపోయిందే మో అనుకున్నారు. కాని వలలు, బుట్టలు మొదలైనవి లేకపోయేసరికి వాళ్ళు వేటకెళ్లా రని రూఢీ అయిపోయింది. మరి వెళ్లినవాళ్లు తిరిగి రాలేదేం?

గోదవారిలో వరద ఉధృతంగా ఉండటం, రాత్రి గాలివానా...

రావులమ్మ, రత్తాలు, నారాయుడి భార్య గుండెలు పగిలేలా ఏడుస్తున్నారు. లచ్చిమి స్పృహతప్పి పడిపోయింది. ఎవరో ముఖంమీ ద నీళ్ళు జల్లితే, మెలకువ వచ్చింది. "బావేడి" అంది వెంటనే.

"ఇంకెక్కడి బావే తల్లీ. అందర్నీ ఆ గోదారి తల్లి మింగేసిందే" అంటూ రత్తాలు లచ్చిమిని పట్టుకుని బోరుమంది.

మూలయ్య, ముత్యాలు, నారాయుడు ఒకళ్ళని పట్టుకుని ఒకళ్ళు ఏడుస్తున్నారు. వాళ్లని సముదాయించడానికి ప్రయత్నిస్తున్నా రు మిగిలినవాళ్ళు. వెళ్లిన వాళ్ళు తప్పక తిరిగొస్తారని ధైర్యం చెబుతున్నారు. కొంత మంది కుర్రాళ్లు ఏటిగట్టు వెంబడి పరుగెత్తా రు వాళ్ళ ఆచూకీ తెలుస్తుందని.

మూలయ్య ధనమ్మ గుడి ముందు నిలబడి "తల్లీ! మాసిన్నప్పటినుంచి నువ్వే కాపాడుతున్నావు. ఇప్పుడీ ఘోరం జరిగిపో యింది. వాళ్లని పేనాలతో తీసుకురా తల్లీ పెద్ద ఏటపోతు వేసి నీకు సంబరం సేయిత్తాను. వాళ్లని నువ్వే రచ్చించాల" అంటూ మొక్కుకున్నాడు.

లచ్చిమి పరుగెత్తికెళ్ళి గుడిలోని విగ్రహం కాళ్ల దగ్గర కుప్ప కూలిపోయింది.

"ధనమ్మ తల్లీ! మా బావని రచ్చించు ఆల్లందరినీ ఎలాగైనా తీసుకురా తల్లీ . ఆల్లని తీసుకు రాకపోతే నేనిక్కడే నీకాల్లదగ్గరే సచ్చిపోతాను" అంటూ గట్టిగా ఏడుస్తూ తలను విగ్రహం కాళ్ళకేసి కొట్టుకుంటుంది . అక్కడనుంచి ఆమెను బయటకు తీసుకొచ్చేశారు మిగిలిన ఆడవాళ్ళు.

సాధారణంగా గోదావరికి కొత్తనీరు వచ్చినప్పుడు ఆడాళ్ళు పసుపు, కుంకుమల్ని గోదావరిలో కలిపి గోదావరికి మొక్కుకుంటూరు తమని చల్లగా కాపాడమని. ఈసారి వర్షం, కొత్తనీరు ఒకేసారి రావడంతో వాళ్లు అశ్రద్ధ చేశారు. గోదావరికి కోపం వచ్చిందేమోనని ఆడాల్లంతా గబగబా పసుపు కుంకు

మళ్ళీ కలిపి వేటకెళ్లిన వాళ్లను రక్షించమని వేడుకున్నారు.

* * *

రోజులు... వారాలు... నెలలు... సంవత్సరాలు గడిచిపోతున్నాయి. గోదావరి వర్షాకాలంలో ఉధృతంగాను, మిగతా కాలాల్లో ప్రశాంతంగానూ ఉంటూ తన ధర్మాన్ని తాను నిర్వహిస్తూనే వుంది.

చేపలు పట్టుకునే పడవలు రాత్రిళ్లు పోయి తెల్లారి తిరిగొస్తూనే ఉన్నాయి. అప్పుడప్పుడు కొన్ని పడవలు గోదారి ఆగ్రహానికి గురవుతూనే ఉన్నాయి.

చింపిరి జుట్టు, చిరగమాసిపోయిన గుడ్డలతో, చిక్కి శల్యమైపోయిన లచ్చిమి పిచ్చిదానిలా ఆ గోదావరి ఒడ్డున రోజూ అటూ ఇటూ తిరుగుతూ గోదావరి వంక ఆశగా చూస్తూనే వుంది.

ప్రతిరోజూ సాయంత్రం సూర్యుడు పడమటి దిక్కున ఉన్న తన ఇంటికి చేరుకుని రాత్రంతా విశ్రాంతి తీసుకుని తెల్లారి తూర్పున ఉదయిస్తూనే ఉన్నాడు.

